సాక్షి
పెద్దపల్లి
గురువారం । 22 । జూన్ । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,808

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,808 పలికింది. కనిష్టంగా రూ.6,103, సరాసరి రూ.6,568గా నమోదైనట్లు దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



'సార్'కు నివాళి

పెద్దపల్లిరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ మహనీయుడని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సార్‌కు నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

యోగాతో ఆరోగ్యం



వేడుకల్లో ఈడీ సునీల్ కుమార్

జ్యోతినగర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఈడీ సునీల్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ పార్కులో యోగా సాధన చేశారు. మంచి ఆరోగ్యం కోసం యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులు, యూనియన్, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధానకోర్టు ఆవరణలో..



యోగా చేస్తున్న హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి డి.హేమంత్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, న్యాయస్థాన అధికారులు, సిబ్బంది యోగా చేశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

సుల్తానాబాద్: యోగాతో మానసిక, శారీరక ఒత్తిడికి దూరంగా ఉండొచ్చని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ ప్రియాంక అన్నారు. బుధవారం సుల్తానాబాద్‌లోని కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి యోగా చేశారు. పోస్టాఫీస్ కార్యాలయంలో వెలుగు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని, వాటి నుంచి దూరం కావాలంటే యోగా తప్పనిసరి అని మేజిస్ట్రేట్ తెలిపారు. కార్యక్రమాల్లో పోస్టల్ అధికారులు సబ్ డివిజనల్ ఇన్స్‌పెక్టర్ మోహన్, రాజమౌళి, సిబ్బంది గణేష్, రవి, సుకుమారి, మూర్తి, సుల్తాన్, ననయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లన్న సన్నిధికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి తరలివచ్చారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

ఎలిగేడు: మండలంలోని నారాయణపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మతల్లికి బోనాలు చేశారు. సుమారు వంద ముదిరాజ్ కుటుంబాలు ఇంటికో బోనం చేసి డప్పు, చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు సబ్బు మల్లయ్య, ఉపాధ్యక్షుడు సబ్బు శ్రీధర్, కార్యదర్శి మ్యాకల రవికిరణ్, డైరెక్టర్లు చొప్పరి మల్లయ్య, సబ్బు శంకర్, పోతుగంటి సురేశ్, కీసరి చంద్రయ్య, సబ్బు లక్ష్మణ్, ఓదెలు పాల్గొన్నారు.

నేడు అమరుల సంస్మరణ దినం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గకేంద్రాల్లో గల అమరవీరుల స్తూపం వద్ద గురువారం ఉదయం 9గంటలకు నివాళులర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అమరులైన వారి కుటుంబ సభ్యులను సన్మానిస్తారని పేర్కొన్నారు. అన్ని పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, విద్యాసంస్థల్లో మౌనం పాటించి అమరుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు.

అభ్యంతరాలుంటే రేపటిలోగా తెలపాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మహిళా సాధికారిత డిస్ట్రిక్ట్‌హబ్‌లో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగ నియామకాలకు సంబంధించి తుది జాబితాను ప్రదర్శించామని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 23లోగా కలెక్టరేట్‌లోని రూం నంబరు 114లో తెలపాలని సూచించారు.

చుట్టపుచూపు సర్పంచులు

- స్థానికంగా ఉండని ప్రజాప్రతినిధులు
- చదువులు, వ్యాపారం పేరుతో పట్టణాలకు..
- అదే బాటలో ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు

మంథని నియోజకవర్గంలోని ఓ గ్రామ సర్పంచ్ స్థానికంగా ఉండకుండా.. హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. స్థానికంగా ఉండాల్సిన పరిస్థితుల్లో మంథనిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆయనను గెలిపించిన గ్రామానికి మాత్రం ఎప్పుడో ఒకసారి చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నాడు. ఈయననే కాదు జిల్లాలో చాలా మంది సర్పంచులు ఇలా గ్రామాలకు వచ్చిపోతున్నారు. ప్రతి మండలంలో ఇలా ముగ్గురు నుంచి నలుగురు సర్పంచులు వివిధ కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఫలితంగా స్థానిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం అవుతున్నారు.



సాక్షి, పెద్దపల్లి: నిత్యం అందుబాటులో ఉంటా.. మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా.. సమస్యలు పరిష్కరిస్తా.. ఎప్పుడు పిలిస్తే అప్పుడు.. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాం.. గ్రామాభివృద్ధికి పాటు పడుతాం.. అని సర్పంచ్ అభ్యర్థులుగా హామీలిచ్చారు. తీరా గెలిచాక సమస్యల పరిష్కారం విషయాన్ని పక్కన పెడితే.. స్థానికంగా ఉండటమే గగనంగా మారింది. జిల్లావ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొందరు తమ గ్రామాలకు సమీపంలోని మండల కేంద్రాల్లో.. మరికొందరు జిల్లాకేంద్రంలో.. ఇంకొందరు కరీంనగర్, హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం 26(2) ప్రకారం ఎన్నికైన సర్పంచ్ 15 రోజులపాటు గ్రామాన్ని విడిచి ఉండరాదు. అలా వెళితే స్థానిక పంచాయతీ అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఉప సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. వారు వచ్చాక అధికారులకు సమాచారం ఇచ్చాకే బాధ్యతలు స్వీకరించాలి. కానీ చాలా మంది స్థానిక ప్రజాప్రతినిధులు స్థానికంగా ఉండకుండా చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పుడే..

జిల్లాలోని 266 గ్రామపంచాయతీలకు 2019లో మూడు విడుతలుగా ఎన్నికలు నిర్వహించిన విషయం తెల్సిందే. ఈ ఎన్నికల్లో గెలిచిన సుమారు 30శాతం మంది పిల్లల చదువులు, వ్యాపారాలు అంటూ కరీంనగర్, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఏదైనా ప్రత్యేక సమావేశాలు ఉంటేనే వారివారి గ్రామాలకు వచ్చి వెళ్తున్నారు. పల్లె ప్రగతి, దశాబ్ది వేడుకల సందర్భంగా అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో కనీస వసతులైన తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర సమస్యలు చెప్పుకునేందుకు సర్పంచ్ అందుబాటులో లేక ప్రతి చిన్న విషయానికీ పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న గొడవలకు సైతం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీటీసీలు, కార్యదర్శులు సైతం

జిల్లాలో గ్రామ ప్రథమ పౌరుడితోపాటు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు స్థానికంగా ఉండటం లేదు. వీరితోపాటు నిత్యం గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు సైతం జిల్లా కేంద్రం, లేదా కరీంనగర్ నుంచి ప్రతిరోజు రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో సకాలంలో గ్రామంలోని ప్రజలకు సేవలు అందలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై డీపీవో చంద్రమౌళిని వివరణ కోరగా.. సర్పంచులు స్థానికంగా ఉండడం లేదన్న విషయం తమ దృష్టికి రాలేదని, అటువంటి వారి వివరాలు సేకరిస్తామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవం

- 'ఖని' రామాలయంలో కలెక్టర్ పూజలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు దాసరి, కోరుకంటి



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్



ఆదివరాహస్వామి ఆలయంలో పుట్ట మధు

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోదండ రామాలయంలో కలెక్టర్ సంగీత బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా ఆమెకు వేద పండితులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఆలయ ఈవో శంకరయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గడ్డగా తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మిక గడ్డగా మారిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా స్థానిక కోదండ రామాలయం, సీఎస్ఐ చర్చి, జుమామసీదులో పూజలు, ప్రార్థనలు చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కలువల శిరీష, కల్వచర్ల కృష్ణవేణి, అడ్డాల స్వరూప, బాల రాజ్‌కుమార్, కవిత సరోజని, నాయకులు తానిపర్తి గోపాల్‌రావు, జాహిద్ పాషా పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో వేద పారాయణం

ఓదెల: ఓదెల మల్లన్నస్వామి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఆలయ ఈవో సదయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షింగా ఉండాలని దాసరి మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలోని 42మంది పూజారులకు దూపదీప నైవేద్యం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే దాసరి తెలిపారు. నీరుకుల్లలోని మానేరు రంగనాయకస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌కు చెందిన విశ్రాంత ఎలక్ట్రికల్ ఉద్యోగి రామరాజు అందించిన రూ.1.72 లక్షల చెక్కును సర్పంచ్ విజేందర్‌కు అందించారు. ఎంపీపీ బాలాజీరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ శీలం శంకర్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో..

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు శివాలయంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ హోమం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పూజలు చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

కమాన్‌పూర్: తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలకేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించారు. పూజారులకు ధూప దీప నైవేద్యాల మంజూరు పత్రాలు అందించారు. ఆలయ చైర్‌పర్సన్ ప్రేమలత, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ధూళికట్ట బౌద్ధ స్తూపం వద్ద

ఎలిగేడు: ధూళికట్ట సర్పంచ్ గొల్లె కావేరి ఆధ్వర్యంలో బౌద్ధ స్తూపాన్ని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, ఎంఈవో కవిత,పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా



జోడోయాత్రలో మక్కాన్‌సింగ్

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. కార్పొరేషన్ రెండో డివిజన్‌లో జోడోయాత్ర చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు పోలుదాసరి కల్యాణ్, మడిపెల్లి మల్లేశ్, పార్టీ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా ఆధ్వర్యంలో అన్నపూర్ణకాలనీ, ఇందిరమ్మకాలనీ, పీకే.రామయ్య క్యాంప్‌లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పీకే.రామయ్య కాలనీలో నిరుపేదలకు 85ఎకరాల భూమి పంచామని, కొందరు ఖాళీస్థలాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని స్థలాల కోసం పోరాటం చేస్తున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తన అనుచరులతో ఖాళీస్థలాలను కబ్జా చేయిస్తూ భూమాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు స్థలాలు ఇవ్వకుంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని, సేవచేసే భాగ్యం కల్పించాలని ప్రజలను ఆయన కోరారు. ఆయన వెంట కార్పొరేటర్లు మహంకాళీ స్వామి, ఎండీ.ముస్తఫా, గాదం విజయ, మరీదు మురళీ, అబ్దుల్లా, ప్రకాశ్, ముచ్చకుర్తి రమేశ్ పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ మీటింగ్

కోల్‌సిటీ: కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం రెండు కౌన్సిల్ సమావేశాలను నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో రాష్ట్ర ఏర్పాటులో అమరులైన వారిని స్మరిస్తూ తీర్మానించనున్నారు. అనంతరం 21 అంశాలపై 8వ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు చేసిన ఖర్చు, చెల్లించాల్సిన బిల్లుల అంశాలను పొందుపర్చారు. శానిటేషన్ విభాగంలోని కంపాక్టర్, స్వీపింగ్ మిషన్, లిట్టర్ పిక్కర్, జట్టింగ్ కమ్ సక్షన్ వాహనాల నిర్వహణ ఖర్చులు, స్వచ్ఛ ఆటోలకు కొత్త టైర్లు కొనుగోలు చేసే తదితర అంశాలను ఎజెండాలో పొందుపరిచారు.

ముగిసిన కొనుగోళ్లు

- లక్ష్యం 3.49 లక్షల టన్నులు
- సేకరించింది. 3.44 లక్షల టన్నులు
- గతేడాదితో పోల్చితే తగ్గిన దిగుబడి
- ఈసారి ధాన్యంలో పెరిగిన 'కోతలు'
- అన్నదాతలకు భారీ నష్టం
- క్వింటాల్‌కు 8 కిలోల వరకు కటింగ్

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఇలా..

ఐకేపీ	డీసీఎంఎస్	పీఏసీఎస్
57	14	228

ఏఎంసీ	మొత్తం
04	303



ధాన్యం లోడ్‌చేస్తున్న హమాలీలు

సుల్తానాబాద్: అనేక అవాంతరాలు.. చెప్పలేని కోతలు.. దిగుమతి చేసుకునేందుకు మిల్లర్ల కొర్రీల మధ్య వానాకాలం సీజన్‌కు సంబంధించిన కొనుగోళ్లు బుధవారం ముగిశాయి. జిల్లావ్యాప్తంగా 303 కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. 3.49 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. కోతలు ప్రారంభంకాగానే అకాలవర్షాలు వెంటాడాయి. దీంతో ధాన్యం తడిసిపోయింది. రంగుమారిన ధాన్యాన్ని కొనబోమని మిల్లర్లు కొర్రీలు పెట్టారు. తరుగుకు ఒప్పుకుంటేనే దిగుమతి చేసుకుంటామని స్పష్టం చేయడంతో చేసేదిలేక రైతులు ఒప్పుకోవాల్సి వచ్చింది. ఇలా 3.40 లక్షల టన్నుల కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు.

ఐదు నుంచి 8 కిలోల తరుగు

కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచే జిల్లాలో వడగండ్లు, అకాలవర్షాలు రైతులను వెంటాడాయి. దీంతో సేకరణ నెమ్మదించింది. ప్రతిరోజూ ఉదయం ఆరబెట్టడం.. సాయంత్రం కుప్పగా పోయడమే రైతుల పనిగా మారింది. మరోవైపు తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేది లేదని మిల్లర్లు స్పష్టం చేశారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పలుమార్లు అధికారులతో సమీక్షించారు. వారి ఒత్తిడి మేరకు మిల్లర్లు పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే దిగుమతి చేసుకున్నారు. అయితే క్వింటాల్‌కు రెండు కిలోల నుంచి ఎనిమిది కిలోల వరకు తరుగు తీశారు. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాస్తారోకోలు, ధర్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మొత్తంగా ఈ సీజన్‌లో రైతులు నష్టపోగా.. రైస్‌మిల్లర్లు మాత్రం భారీగానే లాభపడ్డారు.

జమ కాని డబ్బులు

అనేక ఇబ్బందుల మధ్య ధాన్యాన్ని అమ్ముకున్నప్పటికీ రైతుల ఖాతాల్లో మాత్రం ఇప్పటివరకు డబ్బులు జమకాలేదు. కొందరు రైతులకు 40 రోజులైనా డబ్బులు జమ చేయకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా 48,230 మంది రైతుల నుంచి 3.44 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. ఇప్పటివరకు రూ.442.63 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుల వివరాలు ట్యాబ్‌లలో నమోదు, ట్రక్‌షీట్ తెప్పించుకోవడం.. డీఆర్‌డీఓ, డీఎస్‌ఓ కార్యాలయాలు జనరేట్ చేయడంలో జాప్యం కారణంగానే చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి



జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తి చేశాం. అకాలవర్షాలతో ఈసారి ధాన్యం దెబ్బతింది. అయినప్పటికీ సేకరణ వేగవంతం చేశాం. రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. కొంత ఆలస్యమైనప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. రెండు, మూడు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.

– తోట వెంకటేశ్, డీఎస్ఓ

ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

- నాలాల్లో సోఫాలు, పరుపులు వేయడం సరికాదు
- మున్సిపాల్టీల్లో స్వచ్ఛ బడికి రూ.79 కోట్లు
- తీగల వంతెన-మానకొండూరు లైటింగ్‌కు రూ.20 కోట్లు
- కరీంనగర్ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ ప్రశంసల వర్షం



మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు



ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నాగదుర్గ డ్యాన్స్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రజా భాగస్వామ్యంతోనే నగరాల్లో పరిశుభ్రత సాధ్యమని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్మించిన కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాలాలు శుభ్రం చేస్తుంటే సోఫాలు, పరుపులు, కుర్చీలు వస్తున్నాయని, తీరు మారాలని సూచించారు. మున్సిపాల్టీల్లో స్వచ్ఛబడి రూ.79 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేస్తూ హైదరా బాద్ ఏటా రూ.200 కోట్లు, సిరిసిల్లలో స్వశక్తి సంఘాలు నెలకు రూ.8 లక్షలు సంపాదిస్తున్నాయన్నారు.

నేను పుట్టింది కరీంనగర్‌లోనే..

1976లో తాను ఇక్కడి మిషన్ హాస్పిటల్‌లో జన్మించానని, కరీంనగర్, ఎల్ఎండీలో మూడునాలుగేళ్లు చదివానని గుర్తు చేశారు. టీవీల్లో కనిపించాలన్న ఆత్రంతో కొందరు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు దిగజారి దూషణలకు దిగుతున్నారని, ఇది సరికాదని, అందుకే కౌన్సిల్ మీటింగ్‌కు మీడియాను అనుమతించొద్దన్నానని స్పష్టంచేశారు.

లైటింగ్ కోసం రూ.20 కోట్లు

తీగల వంతెన నుంచి మానకొండూరు వరకు లైటింగ్ కోసం మంత్రి గంగుల కమలాకర్ తనను కోరారని, వెంటనే రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో మానేరు రివర్ ఫ్రంట్ తొలిదశ పూర్తవుతుందన్నారు. దసరా నాటికి రివర్‌ఫ్రంట్‌పై నగర ఆడపడుచులు బతుకమ్మ ఆడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌ను లండన్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ నిజం చేసి చూపించారన్నారు. తీగల వంతెన ఆలోచనకు కారణమైన ఈఎన్‌సీ రవీందర్‌రావును ప్రశంసించారు.

ప్రైవేట్ రంగాల్లోనూ రాణించొచ్చు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ రాణించొచ్చని మంత్రి కేటీఆర్ అన్నారు. రూ.7 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న మోడ్రన్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేశారు. లైబ్రరీలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడున్న వస్తువు భారతీయులది కాదని, విదేశీయుల వస్తువులు వాడే దుస్థితి మనకు ఉండొద్దని సూచించారు.

క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను తొలగిస్తున్న ఏజీఎం శ్రీనివాసులు

కమాన్‌పూర్(మంథని): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారని ఆర్జీ–3 ఏజీఎం (ఫైనాన్స్) శ్రీనివాసులు అన్నారు. సింగరేణి సంస్థలో జరుగుతున్న స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్జీ–3 పరిధిలోని వీటీసీ, ట్రెనింగ్ సెంటర్లను సందర్శించి పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో అధికారులు బీవీ.సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్, మారుతి, వీరన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

మెడికోల అవగాహన ర్యాలీ



జీజీహెచ్ ముందు డాక్టర్లు, మెడికోలు

కోల్‌సిటీ: జీవితంలో యోగా భాగం కావాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, మెడికోలు గోదావరిఖనిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ప్రతిరోజూ యోగా సాధన చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు. స్థానిక పీజీ కాలేజీ మైదానంలో పీజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌తో యోగా టీచర్ అన్నపూర్ణ ప్రదర్శనలు చేయించారు. కార్పొరేటర్లు కృష్ణవేణి, దాతు శ్రీనివాస్, కాలేజీ ప్రిన్సిపాల్ రమాకాంత్, ఏఎస్సై శారద పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ సమావేశాన్ని ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులంతా సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



సర్కార్ (ఫైల్)

రామగుండం: ఎన్టీపీసీ పీకే.రామయ్య కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. ఎన్టీపీసీలో కూలి పనిచేసుకునే విధాన్ సర్కార్ (45) భార్య గతంలోనే చనిపోయింది. గోదావరిలో చేపలు వేటాడుతూ జీవించే విధాన్‌సర్కార్ అప్పటి నుంచి ఒంటరిగా ఫీలవుతున్నాడు. అదే సమయంలో ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది లింగాపూర్ శివారు మేడిపల్లి ఓపెన్‌కాస్టు సమీపంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధాన్‌సర్కార్‌కు దేవరాజ్ సర్కార్, దీపక్ సర్కార్ కుమారులున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సరదా ఈతలు.. కడుపు కోతలు

- డేంజర్ జోన్‌గా పొత్కపల్లి వద్ద మానేరు
- చెక్‌డ్యాం నిర్మాణానికి ఇసుక తవ్వకాలు
- లోతు తెలియక మునిగి 'పోతున్న' ప్రజలు



పొత్కపల్లి మానేరులో లోతైన ప్రదేశం

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండలం పొత్కపల్లి మానేరు ప్రాంతం ప్రజల ప్రాణాలను మింగేస్తోంది. పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన పొత్కపల్లి మానేరు వాగులో చెక్‌డ్యాంలు నిర్మించారు. ఇందుకోసం లోతుగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. అయితే సరదాగా ఈత కొట్టేందుకు వెళ్తున్న ప్రజలు లోతుగా ఉన్న విషయం తెలియక నీటిలో మునిగిపోతున్నారు. ప్రతి ఎండాకాలం సెలవుల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా సమీప గ్రామాల ప్రజలు ఈత కొట్టేందుకు మానేరును ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి వెళ్లి అసువులుబాస్తూ.. తల్లితండ్రులకు కడుపుకోతలు మిగుల్చుతున్నారు. మానేరు చుట్టూ వీణవంక, కొండపాక, చల్లూరు, మల్లారెడ్డిపల్లె, కల్లుపల్లె, జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు ప్రతి ఎండాకాలంలో ఉపశమనం కోసం ఈతకు వెళ్తుంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా.. లోతైన ప్రాంతాలు తెలియక.. అందులో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలా ప్రతి ఏటా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నా.. అధికారులు ఆ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడం లేదు. లోతైన ప్రదేశాల చుట్టూ కనీసం కంచెలు ఏర్పాటు చేయాలని, ప్రమాద సూచికలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల వరంగల్ జిల్లా టేకుమట్ల మండలం వెన్నంపల్లె గ్రామానికి చెందిన పింగిలి సదాశివరెడ్డి బంధువుల ఇంటికి ఇచ్చి మానేరులో ఈతకు వెళ్లి మునిగి చనిపోయాడు. ఈనెల 14న తనుగుల గ్రామానికి చెందిన కాసర్ల నిత్య, జూపాక సాత్విక్ వీణవంక మండలం కొండపాకలోని బంధువుల ఇంటికి వచ్చి మానేరులో ఈత కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. కళ్లెదుటే ప్రాణాలను కోల్పోవటంతో తల్లిదండ్రులు, బంధువుల కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలి



మానేరులో ప్రమాదాలను అరికట్టడానికి రక్షణ చర్యలు చేపట్టాలి. ఈత కోసం ప్రజలు, చిన్నారులు వెళ్లకుండా నిషేధించాలి. చుట్టుపక్కల ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలి. ఓదెల, వీణవంక, జమ్మికుంట మండలాల్లోని పరిసర గ్రామాల్లో ప్రమాద సూచికలు పెట్టాలి.

– కావటి రాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు

కంచెలు నిర్మించాలి



పొత్కపల్లి మానేరు పరిసరాల చుట్టూ కంచెలు పెట్టాలి. ముఖ్యంగా మానేరు పరిసర గ్రామాల్లో ఈతను నిషేధిస్తూ.. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. మానేరులోని లోతైన ప్రదేశాలను గుర్తించి డేంజర్ గుర్తులను ఏర్పాటు చేయాలి.

– పులుగు తిరుపతిరెడ్డి, సర్పంచ్, గుండ్లపల్లె

బోర్డులు పెట్టి క్రీడాప్రాంగణాలంటారా..?



కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉష

పెద్దపల్లిరూరల్: గుట్టలు, అడవులు, శ్మశానాలు, పాఠశాలలు, వెంచర్లలో ఉన్న ఖాళీస్థలాలకు గ్రామీణ క్రీడాప్రాంగణమని బోర్డులు ఏర్పాటు చేస్తే ఎవరికి ప్రయోజనమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రశ్నించారు. బుధవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓదెల మండలం పొత్కపల్లిలో గ్రామీణ క్రీడాప్రాంగణానికి స్థలం కేటాయించాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన వాటిని వినియోగంలోకి తేవాలని కోరారు. స్థలాల ఎంపిక కాకుండా బోర్డులను అమర్చడంపైనే దృష్టిసారించినట్లు ఉందని ఆరోపించారు. ఆమె వెంట మొహసిన్, సతీష్, శివకృష్ణ, అనిల్, పవన్, వర్షిత్, శివ, ఈశ్వర్, రాజేశ్, సాయిప్రణీత్, అభినయ్, వహీద్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు సన్మానం



ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ఉద్యమకారులు, కవులు, కళాకారులను బుధవారంస్థానిక ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సన్మానించారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించి హాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జేఏసీ నియోజకవర్గ చైర్మన్ ఎం.వి జయానంద్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కళాకారులు కవ్వంపల్లి స్వామి, దయానర్సింగ్, కొప్పుల రాజనర్సు, జనగామ రాజనర్సు, ఎదునూరి పద్మ, రమ, విష్ణు, డప్పు రమేశ్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోజివ్ జీఎంగా శ్రీకృష్ణ



శ్రీకృష్ణ

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధిలో బ్లాస్టింగ్స్ అండ్ ఎక్స్‌ప్లోజివ్ ఏజీఎంగా శ్రీకృష్ణ గోపాల్ తివారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎల్‌వీ.సూర్యనారాయణ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్పొరేట్ సేఫ్టీ ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు.

దాడి కేసు నమోదు

జ్యోతినగర్: ఇంట్లోకి చొరబడి కల్లు సీసాలు పగులగొట్టి దాడికి పాల్పడిన ముగ్గురిపై ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ పరిధిలోని నర్రాశాలపల్లెలో మంగళవారం జరిగిన గొడవపై పొన్నం శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ప్రవీణ్, సాయి, రాముపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణ కేసీఆర్ లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: ఆరోగ్య తెలంగాణ సీఎం కేసీఆర్ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నిత్యం యోగాతో ఆరోగ్యంగా ఉండటంతోపాటు, దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని పేర్కొన్నారు. శరీరానికి సమతుల్యత కల్పించడం, ఆరోగ్యకరమైన శరీరాకృతి, భంగిమను అందించడం, అలసటను తగ్గించడం వంటి సమస్యల నుంచి విముక్తి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యోగా నిర్వాహకులను సత్కరించారు. కార్పొరేటర్లు కొమ్ము వేణుగోపాల్, పాముకుంట్ల భాస్కర్, బాల రాజ్‌కుమార్, యోగా నిర్వాహకులు సుధాజీ, సుజాత, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి దూరం: డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: యోగాసనాలతో ఆరోగ్యంగా ఉంటామని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలోని మాతా, శిశుసంరక్షణ కేంద్రంలో అధికారులతో కలిసి ఆసనాలు వేశారు. వైద్యాధికారులు రాజమౌళి, మహేందర్, లావణ్య, శ్రావణ్, హైందవి, రాజేందర్ తదితరులున్నారు. పెద్దపల్లిలోని ఎల్లమ్మ చెరువు వద్ద గల ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పాల్గొన్నారు. మార్వాడీ సేవాసంఘం అధ్యక్షుడు బీకే జాకొటియా, మహిళాసమితి అధ్యక్షురాలు స్నేహలత తదితరులున్నారు.



యోగా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

గోదావరిఖనిటౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. అదనపు జిల్లా న్యాయస్థానంలో జరిగిన వేడుకల్లో మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడితో ఉండేవారు యోగా సాధన చేస్తే జబ్బులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, క్రీడా కార్యదర్శి రంగు శ్రీనివాస్, గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేష్, గోదావరిఖని ఒకటవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ దుర్గం గణేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డీఆర్‌డీవో శ్రీధర్ అన్నారు. మండలంలోని గర్రెపల్లిలో తిరుమలయ్య కుంట వద్ద బుధవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు అనంతరం యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగాతో ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత, ఎంపీడీఓ శశికళ, ఎంపీటీసీ పులి అనూష, ఎంపీఓ ఫయాజ్‌అలీ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం: డీటీవో

జ్యోతినగర్: యోగాతో ఆరోగ్యానికి అవసరమని జిల్లా రవాణాశాఖ అధికారి పి.రంగారావు అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని హైస్కూల్ క్రీడా మైదానంలో టీటీఎస్ వాకర్స్ గ్రూప్ ఏర్పాటు చేసిన సామూహిక యోగా సాధనలో మాట్లాడారు. వాకర్స్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోలింగ్‌లో వివాదం

గోదావరిఖని: మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పెట్రోలింగ్ పోలీసులు చెదరగొట్టే క్రమంలో వివాదం ఏర్పడింది. స్థానిక సీతానగర్‌లో కొంతమంది మద్యం సేవిస్తూ పెట్రోలింగ్ పోలీసులకు కనిపించడంతో వారు లాఠీలకు పని కల్పించారు. వీరిలో కొంత మంది ఓ ఇంట్లోకి పరిగెత్తి దాక్కున్నారు. పోలీసులు ఆ ఇంట్లోకి వెళ్లి లాఠీచార్జి చేశారు. ఇందులో ఇంటి యజమానికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, ప్రజల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. కేసు నమోదు కాలేదన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న జీఎం మనోహర్



యోగాసనాలు వేస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జీఎం కార్యాలయం ఆవరణలో యోగా సాధన చేశారు. యోగాతో శారీరక, మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్, ఫైనాన్స్ మేనేజర్ ధనలక్ష్మిబాయి, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలి

యోగాను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయం ఆవరణలో యోగా సాధన చేశారు. రోజూ గంటపాటు యోగాకు సమయం కేటాయిస్తే రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. కార్మికవాడల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఉద్యోగులతో యోగా ప్రతిజ్ఞ చేయించారు. గండ్ర దామోదర్‌రావు, ఎస్ఓటూ జీఎం రాంమోహన్, పర్సనల్ డీజీఎం లక్ష్మీనారాయణ, సీఎంఓఏఐ ప్రతినిధి డేవిడ్, అధికారులు శివనారాయణ, రామకృష్ణ, రాంమూర్తి, ప్రభాకర్, ఆంజనేయప్రసాద్, సీనియర్ పీఓ సారంగపాణి, శ్రావణ్‌కుమార్, వీరారెడ్డి, యోగా శిక్షకులు రఘుసింగ్‌బాపూజీ, బాలయ్య, లత పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కమాన్‌పూర్(మంథని): సింగరేణి అధికారులు, కార్మికులు నిత్యం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఆవరణలో అధికారులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు నరేందర్, బైద్య, రఘుపతి, ఎలిషా, సీతారామం, శ్రీనివాసులు, వెంకటరమణ, జైనుల్ల బద్దీన్, పద్మరాజు, సుధాకర్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.







స్వచ్ఛ ఆటోలు మూలకు..

రామగుండం కార్పొరేషన్‌లో వినియోగిస్తున్న స్వచ్ఛ ఆటోట్రాలీల టైర్లు అరిగిపోయి మూలకు పడుతున్నాయి. ట్యూబ్‌లెస్ టైర్లు పూర్తిగా అరిగిపోవడంతో తరుచూ పంక్చర్లు అవుతున్నాయి. ఇప్పటికే ఐదు ఆటో ట్రాలీలు బల్దియా కార్యాలయంలో మూలుగుతున్నాయి. సకాలంలో కొత్త టైర్లు తెప్పించకపోవడంతో సమస్య జటిలం అవుతోంది. అధికారులు స్పందించి మూలకుపడిన ఆటోట్రాలీలకు కొత్త టైర్లు బిగించాల్సిన అవసరం ఉంది.

– కోల్‌సిటీ

మంథనిలో తగ్గిన పన్ను భారం

- గృహాలకు 50.. కమర్షియల్‌కు ఒక శాతం
- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు చొరవ
- ప్రజలకు ఏటా రూ.90 లక్షల మేర ప్రయోజనం



మంథని మున్సిపల్ కార్యాలయం

మంథని: మంథని మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత ప్రజలపై పన్నుల భారం పడిందనే అభిప్రాయం నెలకొంది. ఇళ్లతోపాటు ఖాళీస్థలాలకు సైతం మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ ప్రజలు పన్నుల భారంతో సతమతమవుతున్నారు. అయితే పన్నుల భారంపై నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేలా ఇక్కడ పరిస్థితులను ప్రభుత్వానికి వివరించిన జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు.. ప్రత్యేక చొరవతో ఇంటి పన్నుల్లో 50 శాతం, వ్యాపార సముదాయాలకు ఒక శాతం తగ్గింపును సాధించారు.

రెండు జోన్‌లుగా విభజన

భువన్ సర్వే ఆధారంగా ఇంటి పన్ను వసూలుకు ప్రభుత్వం పురపాలక సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపాలిటీల్లో నివాస గృహాలకు ఫీటుకు 30 పైసలు, వ్యాపార సముదాయాలకు 6శాతం వసూలు చేయాలి. సబ్ రిజిస్ట్రార్, ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార ప్రాంతాలకు ఒక జోన్, నివాస గృహాలకు మరో జోన్ నిర్ణయించారు. బస్టాండ్, మార్కెట్ ఏరియాలో రూ.7,800గాను, మంత్రివాడ, మున్సిపల్ ఏరియా, నడివీధిలో రూ.4100, బ్లాక్ నంబర్ 1, 2, 3, 4, 5, 6, 7, 9, 10, 11, 12, 13, 14లను రూ.2100గా నిర్ణయించారు. అలాగే చుట్టు పక్కల ప్రాంతాల బ్లాక్ నంబర్లు 15, 16, 17, 18, 19, 20లను రూ.1700లుగా విభజించి స్థలం విలువ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో కేవలం ఇంటి నిర్మాణం మాత్రమే కొలతలు వేసి పన్ను విధించారు. కాని మున్సిపల్ నిబంధనల ప్రకారం ఇంటి కొలతలతోపాటు యజమానికి సంబంధించిన ఖాళీ స్థలం కలిపి సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో మున్సిపాలిటీలో 4,763 ఇళ్లు, 83 వ్యాపార సముదాయాలుగా గుర్తించారు. మూడు వేలకు పైగా ఇళ్లను రివిజన్ చేసి పన్ను విధించారు. అలా మున్సిపాలిటీకి రూ.1.65కోట్ల ఆదాయం పన్ను రూపంలో సమకూరేది.

ఏటా రూ.90 లక్షలు ప్రయోజనం

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత భువన్ సర్వే ఆధారంగా రివిజన్ చేయబడిన ఇళ్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.వేలల్లో పన్ను మోత పడింది. పన్నుల భారం విషయాన్ని పుట్ట మధు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మున్సిపల్ పరిపాలన విభాగం(సీడీఎంఏ)కు ఇక్కడి పరిస్థితులను వివరించారు. ప్రభుత్వం ద్వారా పన్నుల తగ్గింపు కోసం మాట్లాడారు. అంతేగాకుండా పన్నుల తగ్గింపునకు గెజిట్ అప్రూవల్ తీసుకొచ్చారు. ఈ మేరకు మంథని మున్సిపాలిటీలో 30శాతం ఉన్న గృహ పన్ను 15శాతం, ఆరుశాతం ఉన్న కమర్షియల్ పన్ను ఐదు శాతానికి తగ్గించారు. ఈ క్రమంలో ఏటా రూ.90 లక్షల మేరకు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. తగ్గిన ఇంటి పన్నును పట్టణంలో మిగిలిన ఇళ్ల కొలతలు తీసుకుని రివిజన్ చేసిన అనంతరం కొత్త నిబంధనలకు లోబడి పన్ను విధించనున్నారు.

జెడ్పీ చైర్మన్ చొరవతోనే



మంథని మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్మన్ దృష్టి సారించారు. పాలకవర్గానికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇంటి పన్ను భారంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పన్నుల తగ్గింపునకు కృషి చేసారు.

– పుట్ట శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్, మంథని